

చీనీ టన్ను రూ.22,670
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22,670, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కవరు కట్టు.. లాభాలు పట్టు
మామిడి పిందె దశలో రాలిపోకుండా రైతులు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. పిందె ఏర్పడగానే కవర్ తొడిగి దిగుబడి పెంచుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
39.5°/22.3°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుల నియామకం




బోరెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ రమేష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్రం కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ బోరెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, హిందూపురం పరిశీలకులుగా ఆర్ రమేష్‌రెడ్డి నియమితులయ్యారు.

శింగనమల సమన్వయకర్తగా సాకే శైలజానాథ్



శింగనమల: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా సాకే శైలజానాథ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. సమన్వయకర్తగా సాకే శైలజానాథ్‌ను నియమించడంతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.


జిల్లాలో విరివిగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పర్యావరణ పరిరక్షణకు జిల్లాలో విరివిగా మొక్కలు నాటాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అటవీశాఖ, ఎన్‌హెచ్‌ఏ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, చెరువుగట్లు, బంజరు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇందుకు ఎన్ని మొక్కలు అవసరయో జిల్లా అటవీశాఖ అధికారికి తెలియజేయాలన్నారు. వారంలోపు మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలోని 1,74,065 హెక్టార్లలో 10.43 లక్షల మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



హిందూపురం టౌన్: స్థానిక శ్రీకంఠపురం ఝాన్సీలక్ష్మీబాయి పురపాలక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ప్రవేశాలకు తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రాయపురెడ్డి మంగళవారం పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 24వ తేదీలోపు https://iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 94402 58629, 94904 45744 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈవీఎంల భద్రత పరిశీలన



గోదాము వద్ద పరిశీలన చేస్తున్న జేసీ అభిషేక్

ధర్మవరం రూరల్: స్థానిక మార్కెట్ యార్డ్‌లోని గోదాములో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం)ను జేసీ అభిషేక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. గోదాముకు వేసిన సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు తదితర వాటిని పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ మహేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

రబీ పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. పెట్టుబడులు సైతం చేతికందక రైతులు అప్పులు మూటగట్టుకున్నారు. ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం అంచనాలకే పరిమితమైంది. ఇపుడు ఖరీఫ్‌కు సమయం ఆసన్నమవుతుండగా పెట్టుబడి కోసం అన్నదాత ఆత్మగౌరవాన్ని చంపుకుని ప్రైవేటు వ్యక్తుల వద్ద చేయిచాచాల్సిన దుస్థితి తలెత్తింది. చంద్రబాబు ప్రకటించిన 'అన్నదాత సుఖీభవ' ఊసే లేకపోవడంతో రైతులంతా వైఎస్ జగన్ హయాంలో అమలు చేసిన 'రైతు భరోసా'ను తలచుకుంటున్నారు. వ్యవసాయం దండుగ అని ఎప్పుడో తేల్చేసిన చంద్రబాబు...తన అభిప్రాయం మార్చుకోలేదంటున్నారు.

చిన్నా పెద్దా తేడా లేకుండా 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకం కింద ఏటా ప్రతి రైతుకూ రూ.20 వేలు సాయం అందిస్తాం. రైతుకు ఏ కష్టం రాకుండా చూసుకుంటాం.

– ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. అయినా 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు అందించేందుకు కేటాయింపులు చేశాం.

– గత ఫిబ్రవరిలో శాసనమండలిలో మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన



చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపారు. అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా రైతులకు అర్ధ రూపాయి కూడా సాయం చేయలేదు. పైగా ఉచిత పంటల బీమాకు మంగళం పాడారు. పంటనష్టం అంచనాలతో సరిపెట్టారు. నమ్మి ఓటేసినందున నట్టేట ముంచారు.

– మడకశిర మండలం ఈచలడ్డి గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ ఆవేదన

అన్నదాతను విస్మరించిన కూటమి సర్కార్

- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సకాలంలో జమ
- 11 నెలలుగా విడుదల కాని రాష్ట్ర ప్రభుత్వ వాటా
- పెట్టుబడి సాయం కోసం ఎదురు చూపు
- ఒక్కో రైతుకు చంద్రబాబు రూ.20 వేలు బాకీ
- జిల్లా వ్యాప్తంగా అన్నదాతలకు రూ.560 కోట్లు ఎగనామం
- పెట్టుబడుల కోసం 'ప్రైవేటు' అప్పులు చేస్తున్న రైతులు



భరోసా కరువు.. అప్పుల దరువు

అప్పు కోసం ఆత్మగౌరవాన్ని చంపుకుని..

అతివృష్టి, అనావృష్టితో జిల్లాలో గత ఖరీఫ్, రబీలో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఆదుకోవాల్సిన కూటమి సర్కార్ కేవలం అంచనాలతో సరిపెట్టింది. దీంతో పెట్టుబడులు కూడా చేతికందక రైతులు అప్పుల పాలయ్యారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో పంటల సాగుకు చేతిలో చిల్లిగవ్వలేక ఆత్మగౌరవాన్ని చంపుకుని ప్రైవేటు వ్యక్తుల వద్ద చేతులు చాచాల్సిన పరిస్థితి తలెత్తింది.

కదిరి/మడకశిర రూరల్ : 'ఇది మంచి ప్రభుత్వం' అని గొప్పలు చెప్పిన చంద్రబాబు సర్కార్ ఇంత వరకూ రైతులకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకూ ఏడాదికి రూ. 20 వేలు 'అన్నదాత సుఖీభవ అనే పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన చంద్రబాబు... అధికారం చేపట్టి 11 నెలలవుతున్నా.. ఇప్పటి దాకా దానిపై ఉలుకూ పలుకూ లేదు. కేంద్ర ప్రభుత్వం తరఫున పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే డబ్బులు మాత్రం సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. అధికార టీడీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు 'సుఖీభవ'పై అదిగో..ఇదిగో అని చెప్పడమే కానీ ఖాతాల్లో నగదు జమ చేసింది మాత్రం లేదు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏనాడూ రైతుల పక్షాన మాట్లాడ లేదు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తవుతోందని, ఈ పథకం ద్వారా జిల్లాలో ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున సుమారు రూ.560 కోట్లు చంద్రబాబు ఎగ్గొట్టారని అన్నదాతలు లెక్కలేసి మరీ చెబుతున్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుండి ఇప్పటి దాకా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదని సంబంధిత అధికారులు అంటున్నారు.

గతంలో అన్నదాతకు ఆర్థిక భరోసా

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. ఇందులో కేంద్రం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా ఇచ్చే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మరో రూ.7,500 కలిపి మొత్తంగా 13,500 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో ఏటా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. జిల్లాలో మొత్తం 2,92,170 మంది రైతులుండగా... వీరిలో 2,79,556 మంది రైతులకు గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారానే రూ.1767.09 కోట్లు లబ్ధి చేకూరింది.

మూడు విడతల్లో జమ

గత ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ పంట వేసేముందు ఏటా సరిగ్గా మే నెలలో 'వైఎస్సార్ రైతు భరోసా' కింద రూ.7,500 ఖాతాల్లో జమ చేసేది. తర్వాత అక్టోబర్ నెలలో పంట కోతతో పాటు రబీ సాగు అవసరాలకు రెండో విడతలో రూ.4 వేలు ఇచ్చేది. ఆ తర్వాత జనవరి నెలలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండుగ సమయంలో మరో రూ.2 వేలు ఇచ్చేది...ఇలా మూడు విడతల్లో ఒక్కో రైతుకు మొత్తం రూ.13,500 చొప్పున గత ప్రభుత్వం రైతులకు నగదు రూపంలో నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. ఇలా ఏటా సకాలంలో రైతులను ఆదుకుంటూ వచ్చింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా అనేక రకాలుగా గత ప్రభుత్వం ఆదుకుంటూ వచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం ఇంతవరకూ రైతు సంక్షేమం గురించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

గత ప్రభుత్వం జిల్లా రైతులకు ఇచ్చిన 'భరోసా' వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,56,170	345.83
2020-21	2,78,337	375.75
2021-22	2,70,443	359.80
2022-23	2,68,947	364.24
2023-24	2,79,556	321.47
మొత్తం	2,79,556	1767.09

రైతులకు అండగా నిలవాలి



రైతు భరోసా ద్వారా జగన్ ప్రభుత్వం ఏటా రూ.13,500 ఇచ్చింది. చంద్రబాబు రూ.20 వేలు ఇస్తానని మాటిచ్చాడు. అధికారం చేపట్టి 11 నెలలవుతున్నా ఇంత వరకూ అతీగతీ లేదు. పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయి రూ.20 వేలతో కలిపి వెంటనే రైతుల ఖాతాల్లో ఆ డబ్బు జమచేస్తే బాగుంటుంది.

–రైతు లోకనాథ్‌రెడ్డి, నల్లగుట్లపల్లి, ఓడీసీ మండలం

అప్పు చేస్తేనే విత్తనం వేయగలం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా ఇంతవరకూ రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. ఎన్నికల వేళ చెప్పిన విధంగా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇప్పటి వరకు ఖాతాల్లోకి జమ చేయలేదు. గత ఖరీఫ్, రబీలోనే పంటలు చేతికందక అప్పుల పాలయ్యాం. ఇప్పుడు అప్పులు చేస్తే తప్ప ముంగారు సేద్యం చేయలేం.

– నర్సేగౌడ్ రైతు, రేకులకుంట, మడకశిర మండలం

ఎలాంటి ప్రకటనా రాలేదు



కూటమి ప్రభుత్వం రైతుభరోసా పథకానికి 'అన్నదాత సుఖీభవ' అని పేరు మార్చింది. దీనికి సంబంధించిన నిధుల విషయంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇస్తున్న నిధులు మాత్రం సకాలంలో జమ అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు కూడా త్వరలోనే వస్తాయని అనుకుంటున్నాం.

–డాక్టర్ వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి

తాగి బండి నడిపితే జైలుకు పంపండి

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ... జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ స్కూళ్ల బస్సులను కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ రహదారుల్లోని ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు అమర్చేలా చూడాలన్నారు. సమావేశంలో కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఏ అధికారి భరత్, డీఈఓ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు నేటి నుంచి స్లాట్ బుకింగ్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం నుంచి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ల విధానం అమల్లోకి వస్తుందని జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తెలిపారు. ధర్మవరం, సీకేపల్లి, చిలమత్తూరు, పెనుకొండ, కదిరి, మడకశిర, తనకల్లు, హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే వారు ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకుని నిర్దిష్ట సమయానికి నేరుగా వెళ్లవచ్చన్నారు. దీని వల్ల కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరు కూడా మరింత మెరుగుపడతుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- నేరస్తులకు శిక్ష పడేలా సమగ్ర విచారణ చేయండి
- కేసుల దర్యాప్తు వేగవంతం కావాలి
- నేర సమీక్షలో ఎస్పీ రత్న




సమావేశానికి హాజరైన అధికారులు (ఇన్‌సెట్) ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడేలా సమగ్ర విచారణ జరపాలన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్సు హాలులో డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ రత్న నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మర్డర్, చోరీ కేసులపై సమీక్షించారు. అనంతరం కేసులు పురోగతిలో ప్రతిభ కనబరచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న మాట్లాడుతూ...పోలీసులు గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకం కావాలన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వివిధ స్టేషన్ల పరిధిలో నమోదయ్యే కేసుల వివరాలు ఎప్పటికప్పుడు సీసీటీఎన్‌ఎస్‌లో పొందుపరచాలన్నారు. వేసవిలో చోరీల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అనుమానిత వ్యక్తులు కదలికలతో పాటు వాహనాల తనిఖీలు పెంచాలన్నారు. పోక్సో, లైంగిక దాడుల కేసుల్లో పక్కా సాక్ష్యాధారాలను కోర్టులకు సమర్పించి నేరస్తులకు శిక్షపడేలా చూడాలన్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కేసు నమోదైన 60 రోజుల్లోపు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ ద్వారా అందే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. పోలీస్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణస్వామి, నరసింగప్ప, హేమంత్‌కుమార్, లీగల్ అడ్వయిజర్ సాయినాథ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్ పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తవ్వుకో..తరలించుకో



బేవనహళ్లి వద్ద నది పరివాహక ప్రాంతంలో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లో నింపుకుంటున్న దృశ్యం

- హిందూపురంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- నది పరీవాహక ప్రాంతాల్లో భారీగా తవ్వకాలు
- రోజూ వందల ట్రాక్టర్లతో కర్ణాటకకు తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు

హిందూపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే 'తెలుగు తమ్ముళ్లు' ప్రకృతి వనరులను చెరబట్టారు. నదులు, చెరువుల్లోని ఇసుకను అక్రమంగా తవ్వుకుని సొమ్ముచేసుకుంటున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో హిందూపురం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

రోజూ వందలాది వాహనాల్లో తరలింపు

హిందూపురం నియోజకవర్గంలో కుముద్వతి, కుషావతి, పెన్నా నదుల పరివాహక ప్రాంతాల్లోని ఇసుకను టీడీపీ నేతలు అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ముఖ్యంగా హిందూపురం మండలం సుగూరు, బోరెడ్డిపల్లి, బేవనహళ్లి, సంజీవరాయుడిపల్లి, కిరికెర తోపాటు చిలమత్తూరు పరిధిలో కుషావతి నది పరీవాహకంలోని బలిజపల్లి, నల్లరాళ్లపల్లి, అప్పనపల్లి, దేవరపల్లి, కొడికొండ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. అలాగే చిత్రావతి నది సమీపంలో శెట్టిపల్లి, తిమ్మాడిపల్లి ప్రాంతంలోనూ ఇష్టానుసారం ఇసుకను తవ్వుకుని ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరికొందరు తూమకుంట, సంతేబిదనూర్, బేవనహళ్లి ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లోని ఇసుక తవ్వుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో తవ్విన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా జాతీయ రహదారి మీదుగా కర్ణాటక ప్రాంతంలో నూతనంగా వేస్తున్న లేఅవుట్లకు తరలిస్తున్నారు. ఇలా రోజూ 100 నుంచి 150 లోడ్లు వరకు డంప్ అవుతుంటాయని సమాచారం. ట్రాక్టర్ ఇసుక రూ.2,500 వేల నుంచి రూ.3,500 వేలకు విక్రయిస్తున్నారు. ఇసుక క్వాలిటీని బట్టి టిప్పర్ రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు వసూలు చేసుకుంటున్నారు.

కళ్లప్పగించి చూస్తున్న అధికారులు

హిందూపురంలోని కిరికెర, బేవనహళ్లి, సంతేబిదనూర్, కంచినపల్లి ప్రాంతాల్లోని ఇసుకను రాత్రిపూట కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముందస్తుగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను ఓ రహస్య ప్రాంతంలో డంప్ చేసి ఆ తర్వాత అవసరమైన ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా సరఫరా చేస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా తూమకుంట చెక్‌పోస్టు మీదుగానే సాగుతున్నా... పోలీసులు, విజిలెన్స్ అధికారులు కళ్లప్పగించి చూస్తూ ఉండిపోతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువుల వద్ద ఇసుకను తవ్వుకోవడం, రవాణా చేయడం నేరం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమంగా రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం.

– మహేష్, డీఎస్పీ, హిందూపురం

క్లుప్తంగా

మహిళా చైతన్యానికి సైకిల్‌యాత్ర

● పర్వతారోహకురాలు, సైకిలిస్ట్ సమీరాఖాన్



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్

అనంతపురం అర్బన్: మహిళ సాధికారత, వరకట్న వేధింపులు, గృహహింసపై దేశ వ్యాప్తంగా మహిళల్లో చైతన్యం కల్పించేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు అనంతపురానికి చెందిన పర్వతారోహకురాలు, సైకిలిస్ట్ సమీరాఖాన్ తెలిపారు. తన యాత్ర నేపాల్ వరకూ సాగుతుందన్నారు. సైకిల్ యాత్రను కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా సాధికారత కింద ఎవరెస్ట్ పర్వతారోహణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోలో సైక్లింగ్ క్రౌడ్ ఫండింగ్ ప్రచారాన్ని ప్రారంభించే ముందు మహిళ సాధికారతపై దృష్టి పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.ఉదయ్‌భాస్కర్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న

ప్రశాంతి నిలయం: జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల రవాణా నివారణకు పోలీస్, ఫారెస్ట్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా జాయింట్ ఆపరేషన్లు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసే వారికి వేసే శిక్షల గురించి అందరికీ తెలిసేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల జరిగే చెడు ప్రభావాలను వివరించాలని ఆదేశించారు. విద్యా సంస్థలు వద్ద కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల రహిత జిల్లాగా శ్రీసత్యసాయిని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. మాదకద్రవ్యాల రవాణాకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. లారీలు, బస్సులు, రైలు ద్వారా రవాణా చేస్తున్నవారిని అందుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

కవరు కట్టు.. లాభాలు పట్టు

సాధారణంగా మామిడి పిందె దశలోనే ఎక్కువగా దెబ్బతింటుంది. పురుగు ఆశించి లోపలి గుజ్జు తినడం వల్ల కాయ రాలిపోతూ ఉంటుంది. దీంతో రైతులు భారీగా నష్టపోతుంటారు. దీంతో ఈ సమస్యకు చెక్ పెడుతూ మామిడి రైతులు వినూత్న పద్ధతులపై దృష్టి సారించారు. చెట్టుపై మామిడి పిందెలు ఏర్పడగానే ఫ్రూట్ ప్రొటెక్ట్ కవర్లను తొడిగి లాభాలు గడిస్తున్నారు.

- మామిడికాయల సంరక్షణకు ప్రత్యేక సంచులు
- ఎండలు, వడగండ్ల నుంచి రక్షణ
- నాణ్యమైన దిగుబడులకు దోహదం
- మ్యాంగో ఫ్రూట్ ప్రొటెక్ట్ కవర్‌తో మంచి ఆదాయం



బుక్కపట్నం వద్ద మామిడి తోటలో కాయలకు కట్టిన కవర్లు

పుట్టపర్తి: ప్రస్తుత పరిస్థితులలో ఏ పంట సాగు చేసిన చీడపీడల బెడదతో రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. ఉద్యాన తోటల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి తరుణంలో చిన్నపాటి రక్షణ చర్యలు పాటిస్తూ మామిడి రైతులు తిరుగులేని లాభాలు పొందుతున్నారు.

నాణ్యతకు తిరుగు లేదు

చెట్టుపై మామిడి పిందెలు ఏర్పడగానే 100–150 గ్రాముల బరువు ఉన్న సమయంలో రైతులు ప్రొటెక్ట్ కవర్లను తొడుగుతున్నారు. ఈ కవర్లు బయట బ్రౌన్ కలర్, లోపల బ్లాక్ కలర్‌లో ఉంటాయి. దీంతో అధిక ఎండ నుంచి కాయకు రక్షణగా నిలుస్తాయి. వడగండ్ల వాన కురిసినా కాయలు దెబ్బతినవు. ఈ కవర్ ద్వారా కాయ రంగుతోపాటు బరువు కూడా పెరుగుతుంది. కవర్ తొడిగిన 65 నుంచి 75 రోజుల తర్వాత తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎలాంటి మచ్చలు లేకుండా పసుపు రంగులో కాయలు నిగనిగలాడుతుంటాయి. ప్రతి రైతూ ఈ పద్ధతిని అవలంబిస్తే మామిడి దిగుబడిలో నాణ్యతకు తిరుగు ఉండదని క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మకంగా ఆచరించి, సత్ఫలితాన్ని పొందిన పీఆర్ విశ్రాంత డీఈ, రైతు రాచంరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు.

సస్యరక్షణ అవసరం రాదు

మామిడిలో కాయకు కవర్లు కట్టడం వల్ల సస్యరక్షణ చర్యల అవసరముండదని రైతు భాస్కరరెడ్డి అంటున్నారు. కాయ మొత్తాన్ని కవర్లు చుట్టి ఉండడం వల్ల బ్యాక్టీరియ ఆశించేందుకు అవకాశం ఉండదన్నారు. దీంతో రైతులకు పురుగు మందుల పిచికారీ ఖర్చు తగ్గుతుందన్నారు. కవర్లు తొడగని తోటలో ఎకరాకు 2 టన్నుల దిగుబడి వస్తుండగా... కవర్లు తొడిగిన తోటల్లో ఎకరాకు 4 టన్నుల దిగుబడి వస్తుండడం విశేషం. అంతేకాక ధరలోనూ చాలా వ్యత్యాసం ఉంటోంది. కవర్లు తొడగని కాయలు టన్ను రూ.25 వేలు చొప్పున అమ్ముడు పోతే.. కవర్లు తొడిగిన కాయలు టన్ను రూ.50 వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కవర్లు తొడిగిన కాయలు ఈ ఏడాది గరిష్ఠంగా టన్ను రూ.1.10 లక్షలకు అమ్ముడు పోయాయి.

అధిక లాభాలు



నాకున్న ఐదు ఎకరాల్లో గత 12 సంవత్సరాలుగా మామిడి సాగు చేస్తున్నా. గతంలో కవర్లు తొడగకుండా పంట పండించా. అయితే నాణ్యత లోపంతో తక్కువ ధరకు దిగుబడి అమ్ముడు పోయేది. ఈ ఏడాది ప్రతి కాయకు కవర్లు తొడిగాను. రసాయనిక మందులు వాడకం ఆదా అయింది. దీంతో కాయలు ఎంతో నాణ్యతగా ఉన్నాయి. తోట వద్దనే టన్నుకు రూ.1.05 లక్షలు చెల్లించేలా వ్యాపారులు ఒప్పందం చేసుకున్నారు.

– రాచంరెడ్డి భాస్కరరెడ్డి, రైతు, బుక్కపట్నం

పెట్టుబడులు తగ్గుతాయి



మామిడి కాయకు కవర్లు తొడిగితే పెట్టుబడి ఖర్చులు చాలా తగ్గుతాయి. చీడపీడలు ఆశించవు. కాయ కూడా చాలా నాణ్యతగా ఉండడం వల్ల మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభ్యమవుతుంది. రైతులకు సబ్సిడీతో మ్యాంగ్ ఫ్రూట్ ప్రొటెక్ట్ కవర్లను అందజేస్తాం. ప్రతి మామిడి రైతూ సద్వినియోగం చేసుకోవాలి.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన అధికారి

బీపీఈడీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య బి.అనిత

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో బీపీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య బి.అనిత మంగళవారం విడుదల చేశారు. మొత్తం 63.51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేశ్వర్లు, ఎస్కేయూ న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల వినూత్న నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

పుట్టపర్తి అర్బన్: తమ డిమాండ్లు నెరవేరే వరకూ నిరవధిక సమ్మె చేస్తామని ప్రతినబూనిన సీహెచ్‌ఓలు రెండవ రోజు సమ్మెలో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... జీతభత్యాల సమస్యతో పాటు గ్రాట్యూటీ, ఇంక్రిమెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టండి



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య

తనకల్లు: కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. పెండింగ్ కేసులను త్వరితగతిన విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేయలన్నారు. నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా తయారు చేస్తూ పట్టుబడిన వారితో పాటు బెల్లం విక్రేతపై కేసు నమోదు చేయాలన్నారు. మద్యం దుకాణాలపై డెకాయ్ ఆపరేషన్లు చేపట్టాలన్నారు. బెల్టు షాపులు నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ మారుతీరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు



రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన లగేజ్ స్కానర్

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో లగేజ్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. పేలుడు పదార్థాలు, గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర ప్రమాదకర వస్తువుల రవాణాను అరికట్టేందుకు ఈ స్కానర్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. అంతేకాక రైల్వేస్టేషన్‌తోపాటు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 24 గంటలూ ఆర్‌పీఎఫ్. జీఆర్‌పీ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

రూ. కోట్ల విలువైన భూమి స్వాహా

- ఆన్‌లైన్‌లో మరొకరి పేరుపై బదలాయింపు
- రెవెన్యూ అధికారుల ప్రమేయంపై అనుమానాలు
- భగ్గుమంటున్న బాధితులు



భూమి పత్రాలను తహసీల్దార్ నటరాజ్‌కు చూపుతున్న బాధిత రైతులు

ధర్మవరం రూరల్: రూ. కోట్లు విలువైన పట్టా భూమిని ఆన్‌లైన్‌లో మరొకరి పేరుపై బదలాయింపు జరిగింది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన రైతులు లబోదిబోమంటున్నారు. ఈ అంశంలో రెవెన్యూ అధికారుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మంగళవారం తహసీల్దార్‌ను బాధిత రైతులు కలసి ఫిర్యాదు చేశారు. వివరాలు... కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన ఆదినారాయణరెడ్డి ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన కృష్ణమ్మను పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో కుణుతూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 351–2 లెటర్‌లో ఉన్న 4.54 ఎకరాల పట్టా భూమిని కృష్ణమ్మకు 2008లో ఆమె తల్లి వెంకటలక్ష్మమ్మ రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. అయితే ఈ అంశంపై కృష్ణమ్మ కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటు చేసుకుని అప్పట్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ భూమిపై కొందరు కన్నేశారు. ఆ భూమితో వారికి ఎలాంటి సంబంధం లేకపోయినా... మిగులు భూమి కింద చూపి రెవెన్యూ అధికారులను లోబర్చుకుని భారతి అనే మహిళ పేరుపై ఆన్‌లైన్‌లో మార్పు చేయించారు. అంతటితో ఆగకుండా వెనువెంటనే రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఇటీవల విషయం తెలుసుకున్న కృష్ణమ్మ కుటుంబసభ్యులు మూకుమ్మడిగా మంగళవారం తహసీల్దార్ నటరాజ్‌ను కలసి ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించారు. మొత్తం ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారుల ప్రమేయముందని, ఇందు కోసం రూ.5 లక్షల వరకు చేతులు మారినట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో కంగుతిన్న అధికారులు జరిగిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు సమయం కోరినట్లు తెలిసింది. కాగా, ధర్మవరం పట్టణానికి సమీపంలో ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ. కోట్లు ఉంటుందని రియల్టర్లు అంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ నటరాజ్ మాట్లాడుతూ.. రికార్డులను పరిశీలించి తప్పిదాలు చోటు చేసుకుని ఉంటే సరిచేస్తామని పేర్కొన్నారు.

కామధేను వాహనంపై శ్రీవారు



బొమ్మనహాళ్: స్థానిక వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కామధేను వాహనంపై దేవేరులతో కలసి భక్తులకు శ్రీవారు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఒంటరి జీవితాన్ని తాళలేక రాలిన పండుటాకు

● ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడు

అనంతపురం: ఒంటరి జీవితంపై విరక్తితో ఓ పండుటాకు రాలిపోయింది. మృతి చెందిన భార్య జ్ఞాపకాలు వెంటాడుతుంటే మలివయస్సులో అర్ధంతరంగా తనువు చాలించాడో ఓ వృద్ధుడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రెవెన్యూ కాలనీ, షిర్డీనగర్‌లో నివాసముంటున్న కళ్లమడి నరసింహారెడ్డి (90)కి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె లక్ష్మీనరసమ్మను ఉరవకొండ మండలం ధర్మపురి గ్రామానికి చెందిన జయరామిరెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. కుమారుడు ప్రభాకరరెడ్డి విజయవాడలోని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. మూడేళ్ల క్రితం భార్య మృతి చెందడంతో మానసికంగా కుదేలైన నరసింహారెడ్డి కొంత కాలం విజయవాడలో కుమారుడి వద్ద ఉన్నారు. అయితే తనకు కాలక్షేపం కావడం లేదని, అనంతపురానికి పోతానంటూ పట్టుపడడంతో కుమారుడు కాదనలేకపోయాడు. ఈ నేపథ్యంలో కొన్ని నెలలుగా అనంతపురంలోని సొంతింటిలోనే ఒంటరిగా ఉంటున్న నరసింహారెడ్డి బాగోగులు చూసుకునేందుకు ఓ మనిషిని ఏర్పాటు చేశారు. రెండు నెలలకోసారి కుమారుడు వచ్చి తండ్రి బాగోగులు చూసుకుని కుమారుడు వెళ్లేవారు. కష్ట కాలంలో తనకు తోడుగా భార్య లేదంటూ పలువురితో చెప్పుకుని బాధపడే నరసింహారెడ్డి మంగళవారం ఇంట్లోని హాల్‌లో ఫ్యాన్‌కు పంచతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గుర్తించిన ప్రభాకరరెడ్డి పిన్నమ్మ వెంటనే ఆయనకు ఫోన్ చేసి తెలిపింది. దీంతో విజయవాడ నుంచి బయలుదేరిన ఆయన సాయంత్రం ఇంటికి చేరుకుని, బంధువుల సాయంతో తలుపు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి తండ్రి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నెట్టికంటుడికి కిలో వెండి బహూకరణ



ఆలయ ఈఓ వాణికి వెండి తట్ట, చెంబును అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి డి.హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన భక్తుడు బి.శ్రీధర్‌రెడ్డి కిలో బరువున్న వెండి సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు రూరల్: స్థానిక కసాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వెనుక నివాసముంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి సూర్యనారాయణ రాజు ఇంట్లో చోరీ జరిగింది. తన కుటుంబసభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి ఆయన రెండు రోజులు క్రితం పుట్టపర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చారు. అప్పటికే తలుపులు తీసి ఉండడం గమనించి సమాచారం ఇవ్వడంతో సీఐ ప్రవీణ్‌కుమార్, కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బీరువాలోని 6 తులాల బంగారు నగలు, రూ.12 వేల నగదు అపహరించినట్లుగా గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌ఎస్‌కే సిబ్బంది హేతుబద్ధీకరణకు ఆమోదం



రేషనలైజేషన్‌పై చర్చిస్తున్న జేడీఏ, ఏపీఎంఐపీ పీడీ, డీడీహెచ్, డీఎస్‌ఓ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే)లో పనిచేస్తున్న సిబ్బంది హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ ఫిరోజ్‌ఖాన్, సూపరింటెండెంట్ బాషా, హెచ్‌ఓ రత్నకుమార్, సెరికల్చర్ ఆఫీసర్ డి.ఆంజనేయులు, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్ తదితరులు సమావేశమై చర్చించారు. రేషనలైజేషన్ లేదా రీడెప్లాయిమెంట్ (పునర్విభజన) పేరుతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 450 ఆర్‌బీకేలకు సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ మొదలు పెట్టారు. ఉమ్మడి జిల్లా ఆధారంగా రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియను ముగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలుగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ (వీఏఏ), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ (వీహెచ్‌ఏ), విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్ (వీఎస్‌ఏ) పని చేస్తున్నారు. అలాగే కొన్ని ఆర్‌ఎస్‌కేలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు) పనిచేస్తున్నారు. రేషనలైజేషన్ కింద సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో 1000 నుంచి 1,500 ఎకరాలకు ఒకరిని నియమించనున్నారు. 2024 ఖరీఫ్, 2025 రబీ ఈ–క్రాప్‌లో నమోదైన పంటల విస్తీర్ణం ఆధారంగా నియామకాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆయా మండలాలు, గ్రామాలు, ఆర్‌ఎస్‌కేల పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటల విస్తీర్ణాన్ని బట్టి... ఏది ఎక్కువగా ఉంటే ఆ శాఖ సిబ్బందికి తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర: స్థానిక మారెమ్మ గుడి వీధిలో నివాసముంటున్న రాజశేఖర్(54) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు.. బెంగళూరులో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రాజశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆయన మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం

హిందూపురం: మండలంలోని తూముకుంట ఎస్సీ కాలనీ చెందిన రాజు(40) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఆయన తాగుడుకు అలవాటు పడి తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం భార్యతో గొడవ పడిన రాజు.. ఇంటి పైభాగానికి చేరుకుని సిమెంట్ పిల్లర్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సనపకు పోటెత్తిన భక్త జనం

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో ఊరి దేవరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. 35 సంవత్సరాల తరువాత నిర్వహించిన ఊరి దేవరకు వేల సంఖ్యలో ప్రజలు రావడంతో సనప గ్రామం కిటకిటలాడింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో పెద్దమ్మ తల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జంతువులను బలిచ్చారు. మంగళవారం భక్తులు అమ్మవారికి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఇంట్లో మొక్కుబడిలో భాగంగా పొట్టేళ్లు, గొర్రెలను బలి ఇచ్చారు. బంధు మిత్రులతో కలసి విందు భోజనాలు చేశారు. గ్రామంలోకి వచ్చేందుకు ప్రజలకు గంటల సమయం పట్టింది. మూడు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.



భక్తులు, వాహనాలతో అత్యంత రద్దీగా కనిపిస్తున్న సనప గ్రామం (ఇన్‌సెట్‌లో)పెద్దమ్మ తల్లి విగ్రహం వద్ద టెంకాయలు కొడుతున్న భక్తులు